



ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేశ్

జాబ్ కేపిటల్‌గా విశాఖ

ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా మారుస్తాం



మాట్లాడుతున్న నారా లోకేశ్



విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని గోపాలపట్నం రైతు బజార్ ఎదురుగా నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన తెలుగుదేశం పార్టీ శ్రేణులు

- పెద్దసంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- హైదరాబాద్‌కు దీటుగా నగరాన్ని అభివృద్ధి చేస్తాం
- స్వర్ణకారుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు
- మత్స్యకారుల సమస్యలు పరిష్కారానికి కృషి
- టీడీపీ, జనసేన కార్యకర్తల నడుమ చిచ్చుకు కుట్ర
- అప్రమత్తంగా ఉండాలి
- 'హలో ఏపీ, బైబై వైసీపీ' అందరి నినాదం కావాలి
- శంఖారావం సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 'విశాఖ నగరాన్ని హైదరాబాద్ కంటే రెట్టింపు అభివృద్ధి చేస్తాం. ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా చేసి, పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం'...అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఆదివారం దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ విశాఖను మళ్లీ జాబ్ క్యాపిటల్ ఆఫ్ ఏపీగా తీర్చిదిద్దుతామని స్పష్టంచేశారు.

మత్స్యకారులు, స్వర్ణకారుల సమస్యలపై దృష్టి..

అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులు, స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. స్వర్ణకారులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని, వారికి ఆర్థికంగా సహకారాన్ని అందిస్తామన్నారు. మత్స్యకారులకు సబ్సిడీపై రుణాలు అందించడమే కాకుండా వలలు, ఇతర వస్తువులను అందిస్తామన్నారు. విశాఖపట్నం ... మిగతా 7వ పేజీలో

ఐరన్ లెగ్ జగన్

- విశాఖ పరిపాలనా రాజధాని అన్నాడు...
- 30 ఏళ్ల నుంచి ఉన్న ఎల్‌జీ పాలిమర్స్ పేలింది
- ఆయన్ను నగరానికి ఎంత దూరంలో ఉంచితే అంత మంచిది
- విశాఖలో టీడీఆర్‌ల పేరుతో రూ.వేల కోట్లు మింగిన వైసీపీ నేతలు
- దసపల్లా భూములూ కొట్టేశారు
- అధికారంలోకి వచ్చిన తరువాత వడ్డీతో సహా కక్కిస్తాం
- ఏయూ వీసీ అక్రమాలపై విచారణ చేపట్టి జైలులో పెట్టిస్తాం
- ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులు ఓటుకు రూ.10 వేలు ఇస్తారు
- అవి తీసుకుని టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓటు వేయండి
- 'పశ్చిమ' సభలో నారా లోకేశ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి జగన్ ఐరన్ లెగ్. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తానంటూ ఇక్కడ అడుగుపెట్టాడు. 30 ఏళ్లుగా ఉన్న ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమ పేలిపోయింది. ఏడాదికో పరిశ్రమలో బాయిలర్లు పేలుతున్నాయి'...అంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ఆదివారం రాత్రి పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపాన నిర్వహించిన ... మిగతా 7వ పేజీలో

నేడు జిల్లాలోకి నారా లోకేశ

- ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభలు
- నేటి సాయంత్రం అనకాపల్లిలో, రాత్రికి వడ్డాదిలో..
- ఏర్పాట్లు పూర్తిచేసిన పార్టీ శ్రేణులు
- రేపు మాడుగుల, నర్సీపట్నం, 'పేట నియోజకవర్గాల్లో యువనేత పర్యటన



అనకాపల్లిలో శంఖారావం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, కోట్ని బాలాజీ తదితరులు

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' పేరుతో చేపట్టిన యాత్ర జిల్లాలో సోమవారం నుంచి రెండు రోజులు జరగనుంది. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించనున్న సభలను విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 19వ తేదీ సోమవారం అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల్లో, 20వ తేదీన మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో నిర్వహించే సభల్లో లోకేశ్ పాల్గొని ప్రసంగిస్తారు.

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పేరుతో సుదీర్ఘ కాలం పాదయాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే వివిధ కారణాల వల్ల పాదయాత్ర నిర్వహించని నియోజకవర్గాల్లో కొద్ది రోజుల నుంచి 'శంఖారావం' పేరుతో సభలు నిర్వహిస్తూ టీడీపీ 'సూపర్ సిక్స్' హామీల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తూ ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమ, మంగళవారాల్లో జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'శంఖారావం' సభలు నిర్వహించనున్నారు. అనకాపల్లిలో నిర్వహించే సభ ఏర్పాట్లను ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ, కోట్ని బాలాజీ తదితరులు పరిశీలించారు.

శంఖారావం సభల షెడ్యూల్

అనకాపల్లిలోని పూడిమడక రోడ్డు హైవే జంక్షన్ సమీపంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే శంఖారావం సభలో లోకేశ్ పాల్గొంటారు. సుమారు గంటపాటు ప్రసంగిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 6.30 గంటలకు చోడవరం నియోజకవర్గం బుచ్చెయ్యపేట మండలం వడ్డాది చేరుకుంటారు. ఇక్కడ శంఖారావం సభలో ప్రసంగించి రాత్రి ఎనిమిది గంటలకు బయలుదేరి మాడుగుల నియోజకవర్గం ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు చేరుకుంటారు. రాత్రికి అక్కడ బసచేస్తారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మాడుగుల మండలం డి.సురవరం వద్ద శంఖారావం సభలో పాల్గొంటారు. 11.30 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి నర్సీపట్నం చేరుకుంటారు. భోజన విరామం అనంతరం 2.30 గంటలకు బలిఘట్టంలో జరిగే సభలో లోకేశ్ ప్రసంగిస్తారు. 3.45 గంటలకు ఇక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల చేరుకుంటారు. ఐదు గంటల నుంచి 6.30 గంటల వరకు శంఖారావం సభలో ప్రసంగిస్తారు.

విశాఖకు జన సేనాని



- కొణతాల నివాసానికి వెళ్లి భేటి
- అనంతరం హోటల్‌లో సమన్వయకర్తలతో సమావేశం
- నేడు పూర్తిస్థాయి సమీక్ష



ఒక హోటల్‌లో సమన్వయకర్తలు, నాయకులతో సమావేశమైన పవన్ కల్యాణ్

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదివారం రాత్రి విశాఖపట్నం విచ్చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 7.30 గంటలకు నగరానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన విమానాశ్రయం నుంచి నేరుగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి నోవాటెల్ హోటల్‌కు చేరుకున్నారు. నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కొద్దిసేపు పవన్‌కళ్యాణ్ సమావేశం అయ్యారు. సోమవారం పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై వారితో చర్చించి దిశానిర్దేశం చేయనున్నారు.

-విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు

అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండ

- పట్టించుకోని నియంత్రణ శాఖల అధికారులు



పెదముషిడివాడ ఎర్ర చెరువులో మట్టి తవ్వడంతో ఏర్పడిన గోతులు

పరవాడ, ఫిబ్రవరి 18: మండలంలోని పెదముషిడివాడలో బచ్చల చెరువు, ఎర్ర చెరువుల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. గత కొంత కాలంగా ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్‌ను తవ్వేస్తూ లారీలు, ట్రాక్టర్లతో ఇతర ప్రదేశాలకు రవాణా చేస్తున్నారు. అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు వుండడంతో చర్యలు చేపట్టడానికి అధికారులు వెనుకంజ వేస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పరవాడ మండలంలో ఇళ్ల నిర్మాణాలతోపాటు పరిశ్రమల ఏర్పాటుకు ఫిల్లింగ్ నిమిత్తం మట్టి, గ్రావెల్ అవసరం. దీంతో కొంతమంది వ్యక్తులు అక్రమ తవ్వకాలు, అమ్మకాలను వ్యాపారంగా మార్చుకున్నారు. లంకెల పాలెం సమీపంలోని పెదముషిడివాడ పంచాయతీలో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అండదండలతో బచ్చల చెరువు, ఎర్ర చెరువుల్లో రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు ఎక్సకవేటర్లతో మట్టి తవ్వుతున్నారు. లారీలు, ట్రాక్టర్లలోకి లోడింగ్ చేసి తరలించుకుపోతున్నారు. ఈ క్రమంలో చెట్లను సైతం కూకటి వేళ్లతో కూల్చివేస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ పట్టించుకోకపోవడంతో అక్రమార్కుల మట్టి తవ్వకాలకు అడ్డుఅదుపూ లేకుండా పోతున్నది. చెరువుల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వుతున్న వారిపై చర్యలు చేపట్టాలని గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆరోపిస్తున్నారు. మట్టి తవ్వకాలతో భారీ గోతులు ఏర్పడుతున్నాయని, వర్షాకాలంలో పిల్లలు గోతుల లోతు అంచనా వేయలేక నీటిలో దిగి ప్రమాదాల బారిన పడే అవకాశం వుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నం సమీపంలో పోలవరం కాలవ గట్టును తవ్వేసిన దృశ్యం

పోలవరం కాలువ గట్టును తవ్వేస్తున్న అక్రమార్కులు

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 18: మండలంలోని పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం గ్రామాలకు సమీపంలో పోలవరం ఎడమ ప్రధాన కాలువకు గట్టును కొంతమంది అక్రమార్కులు ఎక్సకవేటర్‌తో తవ్వేసి మట్టి, గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. అర్ధరాతి నుంచి తెల్లవారుజాము వరకు తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అదే విధంగా వమ్మవరం, రామయ్యపట్నం చెరువుల్లో మట్టి; పెదగుమ్ములూరు, కొత్తపోలవరం సమీపంలో కొండల నుంచి గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ప్రకృతి సంపదను దోచేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాదవ యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

వైసీపీకి రాజీనామా

- నేడు లోకేశ్ సమక్షంలో 500 అనుచరులతో కలిసి టీడీపీలో చేరనున్నట్టు శ్రీనివాస్ యాదవ్ వెల్లడి



గొలగాని శ్రీనివాస్ యాదవ్

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 18: ఉమ్మడి విశాఖ జిల్లా యాదవ యువజన సంఘం అధ్యక్షుడు, మల్లాం మాజీ సర్పంచ్ గొలగాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు పంపించినట్టు చెప్పారు. వైసీపీ పాలనలో అన్ని రంగాలు కుదేలైపోయాయని, ముఖ్యంగా యువత, రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పెరిగిన ధరలతో ప్రజలు విలవిలాడుతన్నారని, జగన్ అసమర్థత పాలనతో ఒక తరం నష్టపోయిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా ఒక్క చంద్రబాబునాయుడుకే వుందని అన్నారు. సోమవారం సాయంత్రం వడ్డాదిలో జరిగే లోకేశ్ శంఖారావం సభలో 500 మంది అనుచరులతో టీడీపీలో చేరనున్నట్టు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

జైతవరంలో పలువురు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో రామానాయుడు, పీవీజీకుమార్ - 8లో

పశువులు అక్రమ రవాణాకు చెక్

శ్రీకాకుళం జిల్లా నుంచి గుంటూరుకు తరలిస్తుండగా పట్టుకున్న గో రక్షణ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

- 26 ఆవు దూడ పెయ్యిలు, 14 ఆవులు, ఎద్దులు స్వాధీనం
- ఎస్.రాయవరం పోలీసులకు అప్పగింత
- రెండు వ్యాన్లు సీజ్, నలుగురి అరెస్టు



ఆవు దూడ పెయ్యిలను మినీ వ్యాన్‌లో కుక్కేసి రవాణా చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 18: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను గో రక్షణ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఒక మినీ వ్యాన్‌లో 26 ఆవు దూడ పెయ్యిలను కుక్కేసి రవాణా చేస్తుడడంతో ఊపిరాడక వాటిలో రెండు పెయ్యిలు మృతిచెందాయి. మరో వాహనంలో 14 ఆవులు, ఎద్దులు వున్నాయి. పశువులను రవాణా చేస్తున్న రెండు మినీ వ్యాన్‌లను సీజ్ చేసి, ఇద్దరు నిందితులపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి గో రక్షణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొర్ల దేముళ్లు, ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలు...

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం తిలారు సంత నుంచి రెండు మినీ వ్యాన్లలో పశువులను గుంటూరుకు అక్రమంగా తరలిస్తున్నట్టు మండలంలోని పెనుగొల్లు గ్రామానికి చెందిన గో రక్షణ చారిటబుల్ ట్రస్టు సభ్యులకు ఆదివారం ఉదయం సమాచారం అందింది. దీంతో ట్రస్టు చైర్మన్ గొర్ల దేముళ్లు, సభ్యులు ఆర్.లోవరాజు, ఎస్.దేముళ్లు పెనుగొల్లు వద్ద జాతీయ రహదారిపై మాటు వేశారు. కొద్దిసేపటి తరువాత అనకాపల్లి వైపు నుంచి పశువులతో వస్తున్న వ్యాన్‌ను గుర్తించి, ద్విచక్ర వాహనాలపై వెంబడించారు. అడ్డురోడ్డు సమీపంలో వ్యాన్‌ను అడ్డుకున్నారు. ఇందులో 26 ఆవు దూడ పెయ్యిలు ఉండగా వాటిలో రెండు దూడలు చనిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అడ్డరోడ్డు చేరుకున్నారు. ఇదే సమయంలో మరో వ్యాన్‌లో పశువులు తరలిస్తుండడాన్ని గమనించిన ట్రస్టు సభ్యులు దానిని వెంబడించి కోనవానిపాలెం వద్ద పట్టుకున్నారు. దీనిలో ఆవులు, ఎద్దులు కలిపి 14 పశువులు వున్నాయి. అనంతరం వీటిని పోలీసులకు అప్పగించారు. రెండు మినీ వ్యాన్‌లను సీజ్ చేసి, వాహనాల ఇద్దరు డ్రైవర్లతోపాటు పశువుల తరలింపుకు సంబంధించి మరో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న పశువులను సబ్బవరం సమీపంలోని ఉన్న గోశాలకు తరలించనున్నట్టు చెప్పారు.

Government of Andhra Pradesh
ENDOWMENTS DEPARTMENT
E-PROCURMENT TENDER NOTICE
Re construction of Sri Nagalingeswara Swamy Temple, Velchuru (V), Rambilli(M), Anakapalli Dist. NIT No. P/COE/24/2024-27, Dt.17.01.2024. For further details log onto website https://tender.apeprocurment.gov.in For further details contact Ph: 9985392884.
EXECUTIVE OFFICER
Sri Nagalingeswara Swamy Temple,
Velchuru (V), Rambilli (M), Anakapalli Dist.

యలమంచిలి పురపాలక సంఘం
ఆర్.ఓ.సి. నెం.91/2023/ఎ1 తేది.16.02.2024
బహిరంగ వేలం ప్రకటన
యలమంచిలి పురపాలక సంఘంనకు సంబంధించిన 2024-2025 సం॥నకు అనగా తే.01.04.2024ది నుండి 31.03.2025ది వరకు ఈ దిగువ తెలిపిన గుత్తలు తే.05.03.2024ది మధ్యాహ్నం 3.00 గంటలకు కమీషనరు వారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని పురపాలక సంఘం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించబడును. హెచ్చు పాటపై 18% జి.యస్.టి చెల్లించవలెను. ఇతర వివరములకు మరియు షరతుల కొరకు ఆఫీసు పనివేళలలో రెవెన్యూ విభాగం నందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వేలం వివరణ	ధరవత్తు రూ॥లు	సాల్వెన్సీ ధృవీకరణ పత్రం
1.	రోజువారి వారపు సంత మరియు పశువుల సంత ఆశీలు వసూలు చేసుకొను హక్కు తే.01.04.2024ది నుండి తే.31.03.2025ది వరకు	రూ.5,00,000/-లు	రూ.5,00,000/-లు
2.	మేతల జోలాలో ఆశీలు వసూలు చేసుకొనే హక్కు తే.01.04.2024ది నుండి తే.31.03.2025ది వరకు	రూ.10,000/-లు	రూ.20,000/-లు

Sd/- కె.ఎ. కొండలరావు, కమిషనరు
యలమంచిలి పురపాలక సంఘం

లోకేశ్‌కు జన హారతి

శంఖారావం సభలు సూపర్ సక్సెస్

- తూర్పు, దక్షిణ, పశ్చిమ నియోజకవర్గాల్లోని సమావేశాలకు భారీగా హాజరైన ప్రజలు
- తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పేరట ఆదివారం తూర్పు, దక్షిణ, పశ్చిమ నియోజకవర్గాల్లో నిర్వహించిన సభలకు జనం పోటెత్తారు. పార్టీ శ్రేణులతో పాటు పార్టీ అభిమానులు, నగర వాసులు వెల్లువలా తరలివచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ- జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేస్తే నగరాన్ని అభివృద్ధి పథంలో ఎలా పయనింపజేసేదీ లోకేశ్ వివరించారు. గత ఐదేళ్లుగా కబ్జాలకు నిలయంగా మారిన విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకుంటానని, ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి




తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన అశేష జనవాహిని, అభిమానులు బహూకరించిన కత్తి డాలుతో లోకేశ్



సింహాచలంలో భక్తులతో కలిసి ఫొటో దిగుతున్న యువనేత లోకేశ్



ఇందిరా మునిసిపల్ స్టేడియంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు



లోకేశ్‌కు వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందిస్తున్న దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న లోకేశ్



లోకేశ్‌కు మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, ఇతర నేతలు



లోకేశ్ రాకకోసం ఎదురు చూస్తున్న తూర్పు నియోజకవర్గ మహిళలు



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా



తూర్పు నియోజకవర్గ సభలో టీడీపీ ఆరు గ్యారెంటీల కరపత్రాలను ప్రదర్శిస్తున్న ముస్లిం మహిళలు




లోకేశ్‌ను చూసిన ఆనందంలో మహిళా కార్యకర్తలు, యువతి





తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన అర్బన్ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, దక్షిణ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీలతో నారా లోకేశ్ మాటామంతీ

తారకరత్నకు లోకేశ్ ఘన నివాళి

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 18: నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతి సందర్భంగా విశాఖ నగరంలో ఆదివారం ఆయనకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఘన నివాళి అర్పించారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన శంఖారావం సభా వేదిక వద్ద ఏర్పాటుచేసిన తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.



తారకరత్న చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న లోకేశ్

క్రైం... crime news

బయ్యవరం వద్ద వ్యక్తి అనుమానాస్పద మృతి

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం గ్రామ సమీపంలో కొత్తపల్లి బుచ్చెయ్యపేటకు వెళ్లే రహదారిలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని సీఐ వినోద్‌బాబు తెలిపారు. మృతుడు అసోం రాష్ట్రం ఉదల్‌గురి జిల్లా మంజిత్ మండలానికి చెందిన మంగల్ గ్వాలా(32)గా గుర్తించామన్నారు. బయ్యవరం వద్ద మృతదేహం ఉన్న విషయాన్ని స్థానికులు గుర్తించి వీఆర్‌వోకి సమాచారం ఇచ్చారని, ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఆయన తెలిపారు. మంగల్‌గ్వాలా మృతికి గల కారణాలపై విచారణ చేపడుతున్నామని సీఐ చెప్పారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

కోటవురట్ల, ఫిబ్రవరి 18: మండలంలోని కొత్తూరు రోడ్డు మలుపు వద్ద బైక్ అదుపు తప్పిన సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక ఎస్‌ఐ రమణయ్య అందజేసిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని నీలిగుంట గ్రామానికి చెందిన కరెడ్ల లోవరాజు (41) కుమార్తె కోటవురట్ల కస్తూర్బా విద్యాలయంలో చదువుకుంటుంది. ఆదివారం కుమార్తెను చూడడానికి లోవరాజు భార్య లక్ష్మి వెళ్లింది. భార్యను తిరిగి ఇంటికి తీసుకు రావడానికి లోవరాజు బైక్ వెళుతుండగా కొత్తూరు రోడ్డు మలుపు వద్ద వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది.ఈ ప్రమాదంలో లోవరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కోటవురట్ల ఎస్‌ఐ రమణయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృత్యుడు లోవరాజుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పశువధశాలలపై పోలీసుల దాడి

- ముగ్గురు అరెస్టు, మరో ఇద్దరు పరారీ
- 1,660 కేజీల పశుమాంసం, 9 పశువులు స్వాధీనం

పాయకరావుపేట, ఫిబ్రవరి 18: స్థానిక పీటీడీ బస్టాండును ఆనుకుని రైల్వే పట్టాలకు సమీపంలో నిర్వహిస్తున్న పశుకబేలాపై ఆదివారం తెల్లవారుజామున పాయకరావుపేట పోలీసులు దాడి చేశారు. యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ చైర్మన్ గోపాల్ సమాచారం ఇవ్వడంతో ఆదివారం తెల్లవారుజామున పట్టణంలో పశువులను కబేలాపై పోలీసులు దాడిచేశారు. ఆ సమయంలో పశువుల మాంసం వేరు చేస్తుండడాన్ని గుర్తించి, వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా, మరో ఇద్దరు పారిపోయారు. దాడి సమయంలో షెడ్డులో ఉన్న సుమారు 1,660 కేజీల పశు మాంసాన్ని, సమీపంలో చెట్లకు కట్టి ఉన్న తొమ్మిది పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ జోగారావు మాట్లాడుతూ పట్టుబడిన మాంసాన్ని మధ్యవర్తుల సమక్షంలో పట్టణ శివారులో పాతిపెట్టామని, బతికి ఉన్న పశువులను పశువుల సంరక్షణ శాలకు తరలించామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, అదుపులోకి తీసుకున్న నిందితులను రిమాండ్‌కి తరలించామని ఆయన తెలిపారు.



పట్టుకున్న పశుమాంసాన్ని పూడ్చిపెట్టేందుకు తీసిన గొయ్యిని పరిశీలిస్తున్న పోలీసులు

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న నాగబాబు

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నాగబాబు ఆదివారం అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతాన్ని పలికారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. నాగబాబుకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, నాయకులు దాడి రత్నాకర్, దాడి జయవీర్, మళ్ల సురేంద్ర, జనసేన నాయకులు సుందరపు విజయ్‌కుమార్ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి, పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం వేల్పులవీధిలో గల గౌరీ పరమేశ్వరుల ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



నాగబాబుకు నూకాంబిక చిత్రపటాన్ని అందిస్తున్న నాయకులు

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

మునగపాక, ఫిబ్రవరి 18 : మండలంలోని నాగులాపల్లిలో నారా లోకేశ్ యువగళం రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకూ జరిగే ఈ పోటీలకు కర్నూలు, అల్లూరి, అనంతపురం, అనకాపల్లి, తూర్పు గోదావరి, గుంటూరు, కడప, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి మహిళా జట్లు, అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల నుంచి పురుషుల జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకూ పోటీలు నిర్వహిస్తున్నారు. కాగా ఆదివారం జరిగిన పోటీలలో ముందుగా మహిళల టీమ్ నుంచి అల్లూరి, కర్నూలు జిల్లాలు పోటీ పడ్డాయి. కర్నూలు టీమ్‌పై అల్లూరి జిల్లా గెలుపొందింది. అలాగే అనకాపల్లిపై అనంతపురం, గుంటూరుపై తూర్పు గోదావరి విజయం సాధించగా, కడపపై విశాఖజట్టు విజయం సాధించింది. అలాగే అనకాపల్లిపై విజయనగరం టీమ్ విజయం సాధించింది. అలాగే కర్నూలుపై శ్రీకాకుళం టీమ్ గెలుపొందింది. అలాగే అల్లూరి టీమ్‌పై విశాఖ, అనంతపురంపై తూర్పు గోదావరి జట్లు గెలుపొందాయి. అలాగే పురుషుల టీములలో ఏఎన్‌ఆర్ వారియర్స్‌పై జెఎం.నాయుడు టీమ్ విజయం సాధించింది. 6 బోయ్స్ టీమ్‌పై గంగవరం టీమ్ గెలుపొందింది. అలాగే 7 స్టార్స్ టీమ్‌పై అల్లూరి బి టీమ్ గెలుపొందింది. చంద్రపాలెం టీమ్‌పై పూడిమడక, కుంచంగి టీమ్‌పై వైజాగ్ వారియర్స్ గెలుపొందాయి. సోమవారం ఫైనల్స్, బహుమతి ప్రదానం జరుగుతుంది.



అల్లూరి, కర్నూల్ జిల్లా మహిళల కబడ్డీ పోటీల దృశ్యం

జాబ్ కేపిటల్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ఫిషింగ్ హార్బర్‌ను ఆధునికీకరిస్తామని, ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందిగా మారిన డంపింగ్ యార్డును తరలిస్తామన్నారు. గతంలో అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన స్టేడియం నిరుపయోగంగా మారిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిని ఆధునికీకరించే బాధ్యతను తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు. ఓపెన్ డ్రెయిన్లు ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్నాయని, భూగర్భ డ్రెయిన్లుగా మార్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీకి బలమే కార్యకర్తలు

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని లోకేశ్ అన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే పార్టీ మారినా కార్యకర్తలు అండగా ఉన్నారన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను కల్పిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. రానున్న రెండు నెలలు కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, ఇంటింటికీ వెళ్లి 'సూపర్ సిక్స్' పథకాల గురించి వివరించాలన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య చిచ్చు పెట్టేందుకు ఐదు రూపాయలు ఇస్తే పోస్టులు పెట్టే కొంతమంది యత్నిస్తున్నారని, వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని నారా లోకేశ్ సూచించారు. టీడీపీ, జనసేన కార్యకర్తల లక్ష్యం ఒక్కటేనని, 'హలో ఏపీ, బైబై వైసీపీ' అని లోకేశ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి వేధించిన అధికారులు, వైసీపీ నాయకులపై అధికారంలోకి వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. తాను రెడ్ బుక్ పట్టుకుని తిరుగుతుంటే వైసీపీ నాయకులకు భయం పట్టుకుందని, దీనిపై కోర్టుకు వెళుతున్నారని పేర్కొన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే తనను అరెస్టు చేయాలని లోకేశ్ అన్నారు.

ఐరన్ లెగ్ జగన్

... 5వ పేజీ తరువాయి

'శంఖారావం' సభలో ఆయన మాట్లాడారు. భస్మాసురుడు లాంటి జగన్‌ను విశాఖకు ఎంత దూరం పెడితే అంత మంచిదన్నారు. గతంలో ఎన్నడూ చూడనన్ని ప్రమాదాలను విశాఖ నాలుగున్నరేళ్లలో చూసిందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు విశాఖ వైపు ప్రపంచం చూసేలా అభివృద్ధి చేశారని, జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నాశనం చేశాడన్నారు. జగన్ అక్రమంగా కట్టిన భవనాలను జప్తు చేసి అమ్మి ప్రజలకు పంచి పెడతామని లోకేశ్ అన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో వైసీపీ నాయకులు ఓటుకు పది వేలు ఇస్తామంటారని, అడ్డంగా దోచుకున్న వైసీపీ నాయకులు నుంచి డబ్బులు తీసుకుని టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓటేయలని లోకేశ్ సూచించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యార్థుల మెస్ చార్జీలు పెంచుతామని, వసతి గృహాలను ఆధునికీకరిస్తామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు జగన్ సిద్ధపడుతున్నాడని, దీనికి కారణం ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కు కావడమే నిదర్శనమన్నారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి చేసిన అక్రమాలపై విచారణ జరిపించి డిస్మిస్ చేసి జైలులో పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. ప్రసాదరెడ్డి అక్రమాలన్నీ రెడ్‌బుక్‌లో ఉన్నాయన్నారు. టీడీఆర్ బాండ్లలో ఎంపీ విజయసాయిరెడ్డి భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పెదజాలరిపేట, బిలాల్ కాలనీ, మధురవాడల్లో టీడీఆర్ బాండ్ల పేరుతో వైసీపీ నాయకులు రూ.వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. దసపల్లా భూములు కొట్టేశారని ఆరోపిస్తూ..వీటన్నింటిపై ప్రభుత్వం వచ్చిన తరువాత విచారణ జరిపి వడ్డీతో సహా కక్కిస్తామని పేర్కొన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ స్థానంలో కాలుష్యం లేని పరిశ్రమలు తీసుకువచ్చి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని లోకేశ్ ప్రకటించారు. జింక్ పరిశ్రమ ప్రాంతంలో కూడా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తమ హయాంలో ఎన్‌ఏడీ పై ఓవర్, గోపాలపట్నంలో బీటీ, సీసీ రహదారులతోపాటు ఇండోర్ స్టేడియం నిర్మించామని లోకేశ్ వివరించారు.

అనకాపల్లి పేరుతో త్వరలో సినిమా తీస్తా

- సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తన సొంత నిర్మాణ సంస్థ నక్కిన నరేటివ్స్ బ్యానర్‌పై అనకాపల్లి పేరుతో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు ప్రముఖ సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు ప్రకటించారు. ఆదివారం ఆయన స్థానిక గౌరీ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటీ నటుల ఎంపిక, చిత్రీకరణ అనకాపల్లిలో జరుగుతుందన్నారు. తన సినీ జీవిత ప్రస్తానానికి బీజం పడింది గౌరీ గ్రంథాలయంలోనేనని ఆయన స్పష్టం చేశారు. సినిమాలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయంలోనే చదువుకున్నానని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల పోటీ పరీక్షలు, వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు గ్రంథాలయంలో నిర్వహిస్తుండడంతో చాలా మందికి ఉపాధి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, దాడి ఈశ్వరరావు, బాలాజీ, కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ జగ్గఅప్పారావు, కాండ్రేగుల సురేష్, పీలా జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్యవర్గం నక్కిన త్రినాథరావును ఘనంగా సత్కరించింది.



సమావేశంలో మాట్లాడుతున్న దర్శకుడు నక్కిన త్రినాథరావు

ఉపమాక వెంకన్నను దర్శించుకున్న జిల్లా ఎస్పీ

నక్కపల్లి, ఫిబ్రవరి 18: మండలంలోని ఉపమాక క్షేత్రాన్ని ఆదివారం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ దంపతులు దర్శించుకున్నారు. నక్కపల్లి, అడ్డరోడ్డు సీఐలు ఎ.విజయ్‌కుమార్, అప్పన్న నేతృత్వంలో ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఎస్పీ మురళీకృష్ణకు ఘన స్వాగతం పలికారు. ఎస్పీ దంపతులు, కుటుంబసభ్యులు కొండపై వున్న స్వామి నిజరూపాన్ని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత గురించి అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు తెలియజేశారు. ఎస్పీ కుటుంబసభ్యుల గోత్రనామాలతో పూజలు చేశారు. తదుపరి స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం, తీర్థ ప్రసాదాలను బహూకరించి వేద ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ దంపతులు

20న ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా

- యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీన ఉమ్మడి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయలు ఉద్యోగులకు ఇంకా చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా పీఆర్‌సీ కమిటీని నియమించినప్పటికీ ఈ కమిటీ ఇంకా పనులు మొదలు పెట్టలేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించనట్టయితే ఈనెల 28న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవో నాయకులు లక్ష్మీనారాయణ, నాగభూషణం, సురేష్, జగదీష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మిలాన్-2024

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మిత్రదేశాలతో సంబంధాలు మెరుగుపరుచుకోవడానికి, సహాయ సహకారాలు ఇచ్చిపుచ్చుకోవడానికి రెండేళ్లకు ఒకసారి భారత నౌకాదళం నిర్వహిస్తున్న మిలాన్-2024 సోమవారం నుంచి విశాఖపట్నంలో ప్రారంభం కానుంది. ఈనెల 27వ తేదీ వరకు కొనసాగుతుంది. దీనికి 50 దేశాల నుంచి ప్రతినిధులు, 20కి పైగా యుద్ధనౌకలు, విమానాలు వస్తున్నాయి. మిలాన్ తొలి దశ(హార్బర్ పేజ్)లో భాగంగా అన్ని దేశాల నౌకా దళాలు కలసి ఆర్‌కే బీచ్‌లో ఇంటర్‌నేషనల్ సిటీ పెరేడ్ నిర్వహిస్తాయి. ఇంటర్నేషనల్ మేరీటైమ్ సదస్సు, మిలాన్ ప్రదర్శన ఉంటాయి. రెండో దశలో వివిధ దేశాల నేవీ దళాలు సముద్రంలో, గగనతలంలో విన్యాసాలు ప్రదర్శిస్తాయి. కార్యక్రమాలకు ఉపరాష్ట్రపతి, గవర్నర్‌లను అతిథులుగా ఆహ్వానించారు. రక్షణ శాఖా మంత్రి కూడా హాజరవుతారు.

సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 18 : మండలంలోని రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథసప్తమి పర్వదినం తరువాత వచ్చిన ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి ప్రసాదాలను భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు అందజేశారు.

ఘనంగా కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ఎలమంచిలి, ఫిబ్రవరి 18: మునిసిపాలిటీ సైతారుపేట రోడ్డు రెల్లివీధిలో ఆదివారం కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రాజకొండ శ్రీనివాసశర్మ సమక్షంలో సంప్రదాయ రీతిలో కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని చైర్‌పర్సన్ రమాకుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

సందడిగా రజకుల బల్లల పండుగ

నక్కపల్లి, ఫిబ్రవరి 18: నక్కపల్లి, ఉపమాక గ్రామాల్లో రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ ఏటా సంక్రాంతి తరువాత నెల రోజుల వ్యవధిలో బల్లల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పండుగ సందర్భంగా గ్రామదేవతలైన నూకాలమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉచిత కంటి శిబిరంలో 130 మందికి పరీక్షలు

సబ్బవరం, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వద్ద షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 130 మందికి వైద్యులు పరీక్షలు జరిపారు. వీరిలో 22 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. . కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ప్రకాశ్, బర్ల రమణ, కృష్ణవేణి, వైకుంఠరావు, పట్నాయక్, సత్యంనాయుడు, సీతారత్నం పాల్గొన్నారు.

ముగిసిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం, ఫిబ్రవరి 18 : మండలంలోని దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారు రాజ శ్యామా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్యామా అమ్మవారిపై హరికథ గానం ఆకట్టుకుంది. అనంతరం శ్యామా సిరి జ్యోతి పూజ నిర్వహించారు. గురుపత్ని అన్నపూర్ణ భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీ విద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమా పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆదిబాబు



మునగపాక, ఫిబ్రవరి 18: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని నాగులాపల్లి గ్రామానికి చెందిన పొలమరశెట్టి ఆదిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్ ఆదివారం నియామక పత్రాన్ని ఆదిబాబుకు అందించారు. ఈ సందర్భంగా ఆదిబాబు మాట్లాడుతూ 25 ఏళ్లుగా పార్టీలో కార్యకర్తగా పనిచేసినందుకు తనకు గుర్తింపు లభించిందన్నారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. తగరంపూడి గ్రామానికి చెందిన పొట్నూరి వెంకటరమణ పది మద్యం క్వార్టర్ బాటిళ్లు వెంకుపాలెం మీదుగా తరలిస్తుండగా పట్టుబడినట్టు చెప్పారు. ఈ మేరకు వెంకటరమణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

'పేట' కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకునిగా రాహుల్

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 18 : కాంగ్రెస్ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా మార్టూరుకు చెందిన ఎంవీఆర్ రాహుల్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. రాహుల్ నియామకం పట్ల నాయకులు కూండ్రపు అప్పారావు, తనకాల అనంతరావు హర్షం వ్యక్తం చేశారు.

శంఖారావం సభల ఏర్పాట్లు పరిశీలన

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం మహాసభను టీడీపీ, జనసేన శ్రేణులంతా విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం అనకాపల్లి జాతీయ రహదారి సమీపంలో జరిగే సభా ప్రాంగణాన్ని, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం జరిగే శంఖారావం సభకు ఏడు వేల మందికి పైగా హాజరుకానున్నట్టు చెప్పారు. హాజరైన వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నారా లోకేశ్ కార్యకర్తలతో ముఖాముఖిగా మాట్లాడనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, నాయకులు పంచదార్ల సూరిబాబు, షేక్ బాబర్, కొండలరావు, నానిబాబు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభకు నియోజకవర్గంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఆదివారం తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత కోటవురట్ల శివారు గొల్లపేట సభ ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈనెల 20వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు శంఖారావం బహిరంగ సభలో నారా లోకేశ్ పాల్గొంటారని ఆమె తెలిపారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన వాహనాలను ఒకే చోట ఏర్పాటు చేసి, అక్కడ నుంచి ప్రజలను సభాస్థలికి తీసుకువచ్చే రూట్‌ను ఆమె పరిశీలించారు. సభకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లుచేయాలని ఆమె పార్టీశ్రేణులకు సూచించారు. అనంతరం ఏర్పాట్లపై అనుచరులతో ఆమె చర్చించారు. లోకేశ్ పూరించిన శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆమె వెంట టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పెట్ల లింగంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



నాగులాపల్లి రోడ్డులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు



కోటవురట్లలో లోకేశ్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అనిత, ఆమె అనుచరులు

కోడుగంటి గోవిందరావు సేవలు చిరస్మరణీయం

» సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ దివంగత నేత కోడుగంటి గోవిందరావు సేవలు చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. గోవిందరావు 10వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లి నెహ్రూచౌక్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సీపీఐ కార్యాలయంలో భూ యాజమాన్య హక్కుల చట్టం - పరిణామాలు అనే అంశంపై జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భూ హక్కుల యాజమాన్యం చట్టం ద్వారా సొంత భూములు కలిగిన వ్యక్తులు, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనపై ఉన్న కేసులకు భయపడి కేంద్ర ప్రభుత్వానికి తలవంచాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ డాక్టర్ చెలికాని కృష్ణమోహన్, సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, జగ్గారావు, మేకా సత్యనారాయణ, కోరిబిల్లి శంకరరావు, రెడ్డి అప్పలరాజు, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలేపల్లి వెంకటరమణ

20 నుంచి కన్యకాపరమేశ్వరి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాలు

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 20 నుంచి అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు చెప్పారు. ఆదివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1925 ఫిబ్రవరి నాల్గో తేదీన భీష్మఏకాదశి శుభ దినాన అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం జరిగిందన్నారు. నేటి భీష్మఏకాదశికి వందేళ్లు ప్రవేశిస్తున్న సందర్భంగా ఈ శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. 20వ తేదీన మంగళవారం భీష్మఏకాదశి సందర్భంగా సాయంత్రం 108 మహిళలతో కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరించిన కమిటీ సభ్యులు

అలరించిన త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 18 : కొత్తపేట సీతారాముల ఆలయంలో ఆదివారం సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో సాయంత్రం దీప ప్రచేతనం, త్యాగరాజ పంచరత్న సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి ఇవటూరి కృష్ణ శృతి(గాత్రం), కుమారి కోట గాయత్రి వరేణ్య(వయోలిన్), పీవీఎస్.బాలాజీ యువరాజ్(మృదంగం)కళాకారులచే ఏర్పాటు చేసిన గాత్ర కచేరి విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో అవార్డు గ్రహీత ముదిగొండ సావిత్రమ్మ, అరుణకుమారి, విశాఖ కళాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మార్త సింహాచలం

పాయకరావుపేట, ఫిబ్రవరి 18 : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నామవరం గ్రామానికి చెందిన మార్త సింహాచలం నియమితులయ్యారు. ఆదివారం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిని నుంచి ఈమేరకు నియామక పత్రం అందుకున్నారు.

సబ్‌ప్లాన్ నిధులు దోచుకున్న ప్రభుత్వాలపై తిరుగుబాటు

» డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

పాయకరావుపేట, ఫిబ్రవరి 18 : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దోచుకున్న ప్రభుత్వాలపై దళిత జాతి తిరుగుబాటు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను పక్కదారి పట్టించిన ముఖ్యమంత్రి జగన్, ముఖ్యకార్యదర్శి సాంఘిక సంక్షేమశాఖ, గిరిజనశాఖ కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లపై ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసులు నమోదుచేయాలని గవర్నర్‌కి విజ్ఞప్తి చేశామన్నారు. జగన్‌కి జైకొట్టిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను రానున్న ఎన్నికల్లో ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీబీపీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

విద్యార్థినులకు ఉపకార వేతనాల పంపిణీ

మునగపాక, ఫిబ్రవరి 18 : పదో తరగతి పాసైన 20 మంది విద్యార్థినులకు ఉపకార వేతనాలను జబర్దస్త్ సత్తిపండు అందజేశారు. ఆదివారం స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థినులు ఆర్థిక స్థోమత లేక చదువును మధ్యలో ఆపేస్తున్నారని, అటువంటి వారికి స్కాలర్‌షిప్‌లు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఇలా సాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ స్కాలర్‌షిప్‌లకు నిధులను ప్రవాస భారతీయులు ఆడారి పావని మూర్తి సమకూర్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, సంస్థ అధ్యక్షులు ఎస్. తమ్మిరాజు, కేవీ రమణ, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

గుడ్‌షెపర్డ్ స్కూల్‌లో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 18 : స్థానిక గుడ్‌షెపర్డ్ స్కూల్ 46వ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి స్కూల్ ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ గుడ్‌షెపర్డ్ స్కూల్ స్థాపకులు వినయానంద్ ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలను రత్నాకర్ ప్రశంసించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటీష్‌వారి అరాచకాల నుంచి మన్యం ప్రజలను కాపాడడానికి జరిపిన పోరాటం కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు పాల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు నాటికలో సన్నివేశం

'టీడీపీ శంఖారావంను విజయవంతం చేయాలి'

పాయకరావుపేట, ఫిబ్రవరి 18 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈనెల 20వ తేదీన కోటవురట్ల మండలంలో నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ శంఖారావం ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాళ్ళ వరహాలబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, గుల్లా నాగరాజు, వేములపూడి అప్పారావు, కశింకోట సత్తిబాబు, ఎం.దుర్గాప్రసాద్, ఉప్పరాపల్లి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



శంఖారావం ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను

ఫ్యాషన్ గార్మెంట్స్ కోర్సు కోసం అడ్మిషన్ టెస్టు

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 18 : ఫ్యాషన్,గార్మెంట్ మేకింగ్ కోర్సు కోసం స్థానిక ప్రశాంతి జూనియర్ కాలేజీలో ఆదివారం అడ్మిషన్ టెస్టు నిర్వహించారు. ప్రశాంతి కళాశాలలో రెండు సంవత్సరాల శిక్షణలో భాగంగా ఎఫ్‌జీఎం-24 పేరుతో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 200 మంది పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ లాలం అప్పలనాయుడు తెలిపారు. కేవలం 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఈ పరీక్షలో ప్రతిభ కనపరచిన వారికి బ్రాండిక్స్ కంపెనీ స్టైఫండ్ అందిస్తారన్నారు.

మునగపాక ఎస్ఐ ప్రసాదరావుకు ప్రశంసాపత్రం

మునగపాక, ఫిబ్రవరి 18: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన మునగపాక ఎస్ఐ బి.ప్రసాదరావుకు జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ప్రశంసాపత్రాన్ని అందించారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు. స్టేషన్ పరిధిలో కేసుల పరిష్కారంలో చూపిన చొరవ, శాంతిభద్రతలు, పలు అంశాలలో ప్రతిభ చాటినందుకు ఆయనకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

పెందుర్తి కాంగ్రెస్ పరిశీలకునిగా మేడేటి శంకర్

నక్కపల్లి, ఫిబ్రవరి 18: కాంగ్రెస్ పార్టీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా నక్కపల్లికి చెందిన ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేడేటి శంకర్‌ను ఆదివారం నియమించారు. తనను నియమించిన పీసీసీ చీఫ్ షర్మిల, పార్టీ పెద్దలు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, మీసాల సుబ్బన్నలకు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పెందుర్తిలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం కృషి చేస్తానని చెప్పారు.

జైతవరంలో పలువురు టీడీపీలో చేరిక

చీడికాడ, ఫిబ్రవరి 18: మండలంలోని జైతవరంలో ఇద్దరు పంచాయతీ వార్డు సభ్యులు ఈర్లె అర్జునమ్మ, లాలం అమ్మాజీ, పాలసంఘం డైరెక్టర్ కోడూరు రమణమ్మ సహా 12 కుటుంబాలకు చెందిన వైసీపీ వర్గీయులు ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మాడుగుల మాజీఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్‌లు.. వీరికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో వైసీపీ సీనియర్ నాయకులు రెడ్డి వాసు, మతల శ్రీను, రెడ్డి దేముడుబాబు, లాలం ఈశ్వరరావు, డోకల అప్పారావు, రెడ్డి నాయుడుబాబు, ఈర్లె నూకాలమ్మ, ఈర్లె పార్వతమ్మ, కోడూరు దేముడమ్మ, బొబ్బిలి మాధవి, వారి కుటుంబ సభ్యులు వున్నారు.

గాయత్రీదేవి విరచిత నృహరీ శతకావిష్కరణ

» మహతీ సాహితీ చక్రవర్తి బిరుదు ప్రదానం



గాయత్రీదేవికి మహతీ సాహితీ చక్రవర్తి బిరుదు ప్రదానం చేస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రతినిధులు

నక్కపల్లి, ఫిబ్రవరి 18: ప్రముఖ కవయిత్రి, పండితురాలు డాక్టర్ జి. గాయత్రీదేవి రచించిన నృహరీ శతకం ఆవిష్కరణ ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రతినిధులు నందిని సిద్దారెడ్డి, కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య సంఘ అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, మహతీ సాహితీ సంగమం అధ్యక్షుడు శ్రీవారి సదయ్య తదితరులు గాయత్రీదేవీ విరచిత నృహరీ శతకావిష్కరణ చేశారు. మహతీ సాహితీ చక్రవర్తి బిరుదును, ప్రశంసాపత్రాన్ని అందజేసి ఆమెను సత్కరించారు.

'టీడీపీతోనే ప్రజారంజక పాలన'

ఎలమంచిలి, ఫిబ్రవరి 18 : తెలుగుదేశం పార్టీతోనే ప్రజారంజక పాలన సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర ప్రతినిధి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాజాన నారాయణమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని లైనుకొత్తూరు కాలనీలో టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ఇంటింట తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దల్లమ్మదేవి, రమాదేవి బూత్ కన్వీనర్ గణేష్ కుమార్, మహిళలు పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఎలమంచిలి, ఫిబ్రవరి 18: మునిసిపాలిటీ రామ్‌నగర్‌లో టిడ్కో గృహ సముదాయం వద్ద ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కాలనీ ప్రజలంతా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమానికి ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పడాల కావ్య, మరిడేశ్వరావు, స్థానిక నేత పిల్లా త్రినాథ్ స్వామివారిని దర్శించుకున్నారు.

'టైలర్లు పనితీరును వృద్ధి చేసుకోవాలి'

ఎలమంచిలి, ఫిబ్రవరి 18 : టైలర్లు కాలానుగుణంగా నూతన విధానాలను అందిపుచ్చుకుని మరింత వృద్ధిలోకి రావాలని న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అతికినశెట్టి సత్యనారాయణ సూచించారు. ఆదివారం పట్టణంలో జరిగిన మండల టైలర్స్ కో -ఆపరేటివ్ సొసైటీ సమావేశంలో మాట్లాడుతూ టైలర్లంతా ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో సభ్యులుగా నమోదు కావాలన్నారు. స్థానిక సంఘం అధ్యక్షుడు వియ్యపు సత్యనారాయణ మాట్లాడుతూ టైలర్లంతా సమిష్టిగా ఉంటూ ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా అసోసియేషన్ ప్రతినిధుల సహకారంతో అధిగమించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన అతికిన శెట్టి సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పిల్లా శివ, మళ్ల నాగేశ్వరరావు, డి.శేషుబాబు, వి.రమేష్, ఎస్ఎస్.భద్రరావు, కె.భద్రరావు పాల్గొన్నారు.

బోధనా తరగతులను పరిశీలించిన డీఈవో

అనకాపల్లి, ఫిబ్రవరి 18 : పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన లోప నివారణ బోధనా తరగతులను జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకటలక్ష్మమ్మ పరిశీలించారు. ఆదివారం కశింకోట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, ఎలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తేగాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కశింకోట జడ్పీ హైస్కూలులో తరగతులు నిర్వహించకపోవడం వల్ల ప్రధానోపాధ్యాయుడును, సంబంధిత ఉపాధ్యాయున్ని, 1, 2 మండల విద్యాశాఖాధికారులను వివరణ అడిగినట్టు తెలిపారు.

రాజధాని ఫైల్స్‌ను ప్రతి ఒక్కరూ చూడాలి : అనిత

పాయకరావుపేట, ఫిబ్రవరి 18 : అమరావతి విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్టుగా చూపించిన రాజధాని ఫైల్స్ సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వి.అనిత అన్నారు. రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనకు హైకోర్టు అనుమతి ఇవ్వడంతో ఆదివారం చిత్రమందిర్ థియేటర్‌లో ఆమె పార్టీ నాయకులతో కలిసి సినిమా చూశారు. ఆమెతోపాటు సినిమా చూసినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు అమలకంటి అబద్ధం, గుల్లా నాగరాజు, వేములపూడి అప్పారావు, సీహెచ్.పేర్రాజు, బోడపాటి శ్రీను తదితరులున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వై.సోంబాబు తెలిపారు. మండలంలోని శంకరం గ్రామానికి చెందిన చేపల యమున అనకాపల్లిలో ఒక కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతుందని, శనివారం ఉదయం కళాశాలకు వెళుతున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లిందన్నారు. ఎప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో యువతి అన్నయ్య నాగేంద్ర రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

బంగారమ్మపాలెంలో రింగ్ వలలతో వేట నిషేధం

» నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య



కొర్లయపేట, బంగారమ్మపాలెం గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 18: మండలంలోని బంగారమ్మపాలెం సముద్రతీరంలో రింగ్ వలలతో వేటను నిషేధించడం జరిగిందని నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య ప్రకటించారు. కొర్లయపేట, బంగారమ్మపాలెం మత్స్యకారుల మధ్య వివాదం నెలకొనడంతో ఆదివారం అడ్డరోడ్డులోని నక్కపల్లి సర్కిల్ కార్యాలయంలో ఆ రెండు గ్రామాల వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇరు గ్రామాల మత్స్యకారులు, గ్రామాల పెద్దల అభిప్రాయాలను డీఎస్పీ వెంకట్రామయ్య విన్నారు. అనంతరం రింగ్ వలల వలన నష్టం జరిగే అవకాశం ఉన్నందున బంగారమ్మపాలెం సముద్రతీరంలో రింగ్ వలలతో వేట నిషేధిస్తున్నామన్నారు. ఇకపై ఎవరూ కూడా ఆ ప్రాంతంలో రింగ్ వలలను ఉపయోగించి వేటాడకూడదని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఐలు అప్పన్న, అప్పలరాజు, ఎస్ఐ విభీషణరావు, రెండు గ్రామాల పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





రామయోగి అగ్రహారంలో పుష్పయాగం



పుష్పాలతో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకస్వాములు

కె.కోటపాడు, ఫిబ్రవరి 18 : మండలంలోని రామయోగి అగ్రహారంలో ఆదివారం హనుమాన్ లక్ష్మణ సమేత సీతారామస్వామి ఆలయంలో పుష్పయాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండవారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 1500 కేజీల పువ్వులతో విగ్రహాలను, ఆలయాన్ని అలంకరించి వేదపండితులు విశేష పూజలు జరిపారు. తొలుత క్షీరాభిషేకాన్ని చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.

'వైసీపీ నాయకుల ప్రోత్సాహంతోనే అక్రమ నిర్మాణాలు'



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

రావికమతం, ఫిబ్రవరి 18 : కొత్తకోట మేజర్ పంచాయతీకి చెందిన ఖాళీ స్థలంలో వైసీపీ వర్గీయులే సర్పంచ్, ఉప సర్పంచ్‌ల అండతో అక్రమంగా షాపులు నిర్మిస్తున్నారని నిరూపిస్తామని టీడీపీ నాయకులు కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, వెల్లంకి శ్రీను తదితరులు స్పష్టం చేశారు. ఇందుకు వారు సిద్ధమైతే తమ సవాల్‌ను స్వీకరించి బహిరంగ చర్చ రావాలని పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ స్థలంలో ప్రస్తుతం జరుగుతున్న షాపుల నిర్మాణాలకు ఎటువంటి చట్ట బద్ధత లేదని ఆరోపించారు. అధికార గర్వంతో వైసీపీ అనుచరులకు పంచాయతీ స్థలంలో షాపుల నిర్మాణానికి అవకాశం కల్పించారన్నారు. గ్రామంలో ఉప సర్పంచ్ కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అక్రమించుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారుల నుంచి రూ.25 వేలు వసూలు చేసింది వైసీపీ వారు కాదా.. దీనిపై లబ్ధిదారులు మిమ్మల్ని పంచాయతీ కార్యాలయంలోనే నిర్బంధించింది వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. పంచాయతీయే షాపులు నిర్మించి, బహిరంగ వేలం ద్వారా చిరువ్యాపారులకు అద్దెకు ఇవ్వాలన్నారు.

బూత్‌స్థాయి నుంచి కష్టపడితే విజయం

▸▸ టీడీపీ విస్తృత సమావేశంలో మాజీ మంత్రి అయ్యన్న



బూత్ ఇన్‌చార్జ్‌లనుద్దేశించి మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు



వడ్డాదిలో సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న తాతయ్యబాబు తదితరులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 18 : బూత్ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని మాజీ మంత్రి సిహెచ్.అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. మునిసిపాలిటీ పరిధిలోని 28 వార్డుల్లో గల బూత్ ఇన్‌చార్జిలు, నాయకులతో ఆదివారం ఇక్కడ 'మన బూత్- మన భవిష్యత్తు' పేరిట సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌స్థాయి నుంచి కష్టపడి పనిచేసి అత్యధిక మెజారిటీ సాధించాలన్నారు. మెయిన్ రోడ్డు విస్తరణ చేయడమంటే అబీద్ సెంటర్ నుంచి శ్రీకన్య కూడలి వరకు మాత్రమే కాదని, చింతపల్లి రోడ్డు, కృష్ణాదేవి పేట రోడ్డు కూడా విస్తరణ చేయాలని ఎమ్మెల్యేనుద్దేశించి అన్నారు. టీడీపీ హయాంలో రూ.13 కోట్లతో పెద్ద చెరువును ట్యాంక్ బండ్‌గా చాలా వరకు అభివృద్ధి చేశామని, దేశ నాయకుల విగ్రహాలు కూడా తయారు చేయించామని వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయని విమర్శించారు. ట్యాంక్ బండ్ పనులు మొదలు పెడుతున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించి ఎటువంటి పనులు చేయలేదని విమర్శించారు. టిడ్కో గృహాలకు సంబంధించి లబ్ధిదారుల బ్యాంక్ రుణం మాఫీ చేస్తామని చెప్పి జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశారన్నారు. మంగళవారం బలిఘట్టంలో జరగనున్న నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రమణ, కౌన్సిలర్లు ధనిమిరెడ్డి మధుబాబు, డబ్బీరు శ్రీకాంత్, పార్టీ నాయకులు రావాడ నాయుడు, మురళీ, నేతల నాగేశ్వరరావు, పెదిరెడ్ల చింతు తదితరులు పాల్గొన్నారు.

'వడ్డాదిలో లోకేశ్ శంఖారావం సభకు ఏర్పాట్లు పూర్తి'

బుచ్చెయ్యపేట : వడ్డాదిలో సోమవారం నిర్వహించనున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభకు ఏర్పాట్లు పూర్తయినట్టు ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు తెలిపారు. గ్రామంలోని జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడుతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం సాయంత్రం ఐదు గంటలకు లోకేశ్ వడ్డాది చేరకుంటారన్నారు. ఉత్తరాంధ్రలో శంఖారావం సభలు సూపర్ సక్సెస్ కావడంతో వైసీపీ పాలకుల వెన్నులో వణుకు పుట్టిందన్నారు. జగన్ అవినీతి, నియంత పాలనపై లోకేశ్ విరుచుపడుతున్న విధానాన్ని చూసి వారికి నిద్ర కరువవుతోందన్నారు. లోకేశ్ సభకు నియోజకవర్గంలోని చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంస్థాగత ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలిరావాల్సిందిగా కోరారు.

21న జిల్లాస్థాయి గుర్రపు పరుగు పోటీలు

చీడికాడ, ఫిబ్రవరి 18 : జి.కొత్తపల్లిలో జిల్లాస్థాయి గుర్రపు పరుగు పోటీలను ఈ నెల 21న నిర్వహించనున్నారు. మంగళవారం అభయాంజనేయస్వామి తీర్థం జరగనుండడంతో ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఔత్సాహికులు ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలలోగా పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

జైతవరంలో పలువురు టీడీపీలో చేరిక

చీడికాడ, ఫిబ్రవరి 18: మండలంలోని జైతవరంలో ఇద్దరు పంచాయతీ వార్డు సభ్యులు ఈర్లె అర్జునమ్మ, లాలం అమ్మాజీ, పాలసంఘం డైరెక్టర్ కోడూరు రమణమ్మ సహా 12 కుటుంబాలకు చెందిన వైసీపీ వర్గీయులు ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్‌లు.. వీరికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో వైసీపీ సీనియర్ నాయకులు రెడ్డి వాసు, మతల శ్రీను, రెడ్డి దేముడుబాబు, లాలం ఈశ్వరరావు, డోకల అప్పారావు, రెడ్డి నాయుడుబాబు, ఈర్లె నూకాలమ్మ, ఈర్లె పార్వతమ్మ, కోడూరు దేముడమ్మ, బొబ్బిలి మాధవి, వారి కుటుంబ సభ్యులు వున్నారు.



మాడుగుల ఎంపీపీగా రాజారామ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన రాజారామ్‌ను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 18 : మాడుగుల ఎంపీపీగా తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఎంపీపీ పదవికి వేమవరపు రామధర్మజ రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీగా కొనసాగుతున్న రాజారామ్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా హాజరై అతనిని అభినందించారు. జడ్పీటీసీ రమణమ్మ, వైసీపీ మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ కళావతి, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీకి రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పడం తథ్యం'



పార్టీలో చేరిన వారికి జనసేన కండువా కప్పుడుతున్న రాజు

రోలుగుంట, ఫిబ్రవరి 18 : వైసీపీ దౌర్జన్యాలు, దుర్మార్గపు పాలనకు రాష్ట్ర ప్రజానీకం బుద్ధి చెప్పడం తథ్యమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని కంచుగుమ్మలలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజలు వైసీపీని నమ్మేస్థితిలో లేరన్నారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కంచుగుమ్మల పంచాయతీకి చెందిన 70కుటుంబాలు పీవీఎస్ఎన్ రాజు సమక్షంలో జనసేనలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బలిజి మహారాజు, ప్రధాన కార్యదర్శి పరవాడ దొరబాబు, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'జనసేన, టీడీపీ కూటమి గెలుపే లక్ష్యం కావాలి'

బుచ్చెయ్యపేట : రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి విజయమే లక్ష్యంగా అంతా పనిచేయాలని జనసేన పార్టీ మండల కార్యదర్శి సయ్యపురెడ్డి నవీన్ జనసైనికులకు పిలుపునిచ్చారు. వడ్డాదిలో ఆదివారం జరిగిన పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ పాలకులు చోడవరం నియోజకవర్గంలో రహదారులు, సాగునీటి వనరుల అభివృద్ధిపై దృష్టిసారించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బీఎన్ రోడ్డు అభివృద్ధి పనులను డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేస్తామన్న పాలకులు ఫిబ్రవరి నెలాఖరు వచ్చినా పట్టించుకోలేదని దుయ్యబట్టారు. పెద్దేరు రిజర్వాయర్ కుడి కాలువ సీసీ లైనింగ్ అభివృద్ధి, విజయరామరాజుపేట, వడ్డాది, గౌరీపట్నం గ్రోయిన్ నిర్మాణాలతో పాటు, ఎల్‌బీపీ అగ్రహారం ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోవడంతో సుమారు ఇరవై వేల ఎకరాల్లో ఆయకట్టు దెబ్బతిని రైతులు పంటనష్ట పోతున్నారన్నారు. నాయకులు సయ్యపురెడ్డి జనార్ధన్, వరహాలు, బొబ్బాది మాణిలు, గణేశ్, అరిశంకల వాసు, నాళం వరహాలు పాల్గొన్నారు

విపత్తుల నుంచి కాపాడుకోవడం పై అవగాహన

కె.కోటపాడు, ఫిబ్రవరి 18 : ప్రకృతి విపత్తుల నుంచి మనతో పాటు తోటి వారిని కూడా కాపాడుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ప్రకృతి విపత్తుల నివారణ కో-ఆర్డినేటర్ బండి సురేష్ సూచించారు. ఆదివారం కె.కోటపాడులోని రామాలయంలో ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, సత్యసాయి సేవా సంస్థల జోన్ 3 కన్వీనర్ కసిరెడ్డి అప్పలనాయుడు, ఆధ్యాత్మిక సమన్వయకర్త దార్ల శివ గురన్నాచారి, విశాఖ జిల్లా ప్రకృతి విపత్తుల నివారణ సంస్థ కో-ఆర్డినేటర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.


కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 18 : ఏఎల్ పురం ఎస్సీ, బీసీ కాలనీలో ఎంపీ సత్యవతి ఎంపీ నిధులతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ లోచల సుజాత శంకుస్థాపన చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీటీసీలు చింతల బుల్లి ప్రసాద్, మామిడి కృష్ణ, పెదబాబులు, కొండబాబు పాల్గొన్నారు.

37 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

రోలుగుంట, ఫిబ్రవరి 18 : జె.నాయుడుపాలెం శివారులో 37 మద్యం సీసాలతో మాకవరపాలెం మండలం బూరుగుపాలేనికి చెందిన వ్యక్తి పట్టుబడినట్టు ఎస్ఐ సురేష్ ఆదివారం తెలిపారు.

జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల కలయిక



కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చోడవరం, ఫిబ్రవరి 18 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2010-12 విద్యా సంవత్సరంలో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పన్నెండు సంవత్సరాల తరువాత అంతా ఓచోట చేరడంతో వీరి ఆనందాలకు అవధులు లేదు. ఒకరియోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. గురువులను సత్కరించిన అనంతరం సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

'జగన్‌ను గద్దె దించకపోతే భావితరాలకు నష్టం'



సమావేశంలో శ్రీరామమూర్తి తదితరులు

చోడవరం, ఫిబ్రవరి 18 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకాలను ప్రజలకు వివరించడంతో పాటు, బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతూ ఈనెల 21 నుంచి అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో బీజేపీ ప్రజా పోరు యాత్ర నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ చేతకాని పాలనతో రాష్ట్రం అన్నిరంగాల్లో సర్వనాశనం అయిపోయిందని ఆరోపించారు. జగన్‌ను గద్దె దించకపోతే భావితరాలు పూర్తిగా నష్టపోవడంతో పాటు, రాష్ట్ర ప్రగతి మరింత కుంటుపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ అవకాశం కల్పిస్తే అనకాపల్లి ఎంపీ స్థానం లేదంటే చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు. ఈ సమావేశంలో నాయకులు కందర్ప రమణమూర్తి, అప్పలకొండనాయుడు, మేరపరెడ్డి శ్రీనివాస్, పరవాడ మురళి, సీతానాగరాజు, బుద్ధా అమర్‌నాథ్ పాల్గొన్నారు.



మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



మాడుగుల రూరల్, ఫిబ్రవరి 18 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది. కొందరు మహిళలు ఘటాలను ఊరేగింపుగా తీసుకు వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లక్ష ప్రమిదలతో దీపారాధన రేపు



విద్యుద్దీపాలంకరణలో షిర్డీసాయి ఆలయం

నర్సీపట్నం, ఫిబ్రవరి 18 : భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం ఇక్కడి షిర్డీసాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష ప్రమిదలతో దీపారాధన నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సన్నాహాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వివిధ ఆకృతులలో ప్రమిదలను అమర్చుతున్నారు. భీష్మఏకాదశి రోజున ఆలయంలో విశేష పూజలు, సామూహిక సాయి వ్రతాలు జరపనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి రామ్‌గోపాల్ తెలిపారు.

20 నుంచి ఉమామహేశ్వరిదేవి తీర్థం

దేవరాపల్లి, ఫిబ్రవరి 18 : మండల కేంద్రం దేవరాపల్లిలో ఉమామహేశ్వరిదేవీ తీర్థం మంగళవారం ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదివారం ఇక్కడ ఆవిష్కరించారు. జడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, బూరే బాబూరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సింహాచలం నాయుడు, మొల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

24న నల్లగొండమ్మ ఆలయ గిరిప్రదక్షిణ

నాతవరం, ఫిబ్రవరి 18 : మండలంలోని తాండవ నల్లగొండమ్మతల్లి ఆలయ గిరిప్రదక్షిణ ఈనెల 24వ తేదీ శనివారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేపడుతున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు 20 కిలోమీటర్లు అమ్మవారి ఆలయం కొండచుట్టూ భక్తులు ప్రదర్శన చేయనున్నారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వారు చెప్పారు.

జూనియర్ కళాశాలకు కంప్యూటర్లు వితరణ



ప్రిన్సిపాల్‌కు కంప్యూటర్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 18 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థులు రెండు కంప్యూటర్లను అందజేశారు. 1980- 82 విద్యా సంవత్సరంలో చదువుకున్న వీరంతా ఆదివారం ప్రిన్సిపాల్ చిన్నారావుకు కంప్యూటర్లు అందించారు. ఈ కార్యక్రమంలో పెదపాటి గోవింద్, కన్నయ్యశెట్టి, ఎంవీ రంగారావు, శివశంకర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కాపులను గుర్తించే పార్టీకే మద్దతు'

చోడవరం, ఫిబ్రవరి 18 : జిల్లాలో అనకాపల్లి పార్లమెంట్ సహా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల సీట్లు కాపులకు కేటాయించే పార్టీకే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యడ్ల త్రినాథ్, మలపరెడ్డి కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం వారు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని పాయకరావుపేట, ఎలమంచిలి, చోడవరం, పెందుర్తి, అనకాపల్లి నియోజకవర్గాల్లో కాపులు అత్యధికంగా ఉన్నారన్నారు. నర్సీపట్నం, మాడుగుల నియోజకవర్గాల్లో సైతం ఫలితాలను మార్చేస్థాయిలో కాపుఓటర్లు ఉన్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో కాపులకు గుర్తించే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు.

అయ్యన్న కాలనీలో మండపం ప్రారంభం



కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, ఫిబ్రవరి 18 : మునిసిపాలిటీ పరిధి 28వ వార్డు అయ్యన్న కాలనీలో శ్రీకృష్ణదేవరాయుడు కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఆదివారం ప్రారంభించారు. శ్రీకృష్ణదేవరాయుడు విగ్రహాన్ని డాక్టర్ అధికారి గోపాలరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, గొలుసు నర్సింహమూర్తి, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ బాషా, గొల్లవిల్లి రాము పాల్గొన్నారు.

కిత్తంపేటలో పశువుల పాక దగ్ధం

రావికమతం, ఫిబ్రవరి 18 : కిత్తంపేటలో శనివారం రాత్రి కింతాడ సత్తిబాబుకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. ఈ ఘటనలో పాడి గేదెకు తీవ్ర గాయాలు కావడంతో అది కట్టుతెంచుకుని పారిపోయింది. పాకతో పాటు పక్కనే ఉన్న గడ్డివాము కూడా పూర్తిగా కాలి బూడిదైంది. మంటలు చెలరేగుతుండగా సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇది ఎవరో గిట్టనివారు చేసిన పనేనని కొత్తకోట పోలీసులకు ఆదివారం బాధితుడు ఫిర్యాదు చేశారు.

'మోడల్ పంచాయతీగా జైతవరం'

చీడికాడ, ఫిబ్రవరి 18 : రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జైతవరాన్ని మోడల్ పంచాయతీగా అభివృద్ధి చేస్తామని ఆ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పూర్వ వైభవం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, మాజీ అధ్యక్షుడు డోకల అక్కునాయుడు, ఎంపీటీసీ పైల ముత్యాలనాయుడు, మాజీ ఎంపీటీసీ పైలా వెంకటరమణ, రెడ్డి కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.